క్లుప్తంగా

కుటుంబం చెంతకు మహిళ



ఆసియాను తండ్రి అహ్మద్ హుస్సేన్‌కు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధి

అల్లిపురం: మతిస్థిమితం లేని తెలంగాణాకు చెందిన ఆసియా (29) అనే అవివాహిత మహిళను ఏప్రిల్‌లో ఏయూటీడీ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో గుర్తించారు. సరూర్ నగర్ జిల్లాలోని వాడి గ్రామానికి చెందిన ఆమె ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చేసింది. రెండేళ్లుగా ఈమె మానసిక వ్యాధితో బాధపడుతోంది. తండ్రి ఆస్పత్రిలో చేర్చే ప్రయత్నం చేయడంతో గొడవ పడి, ఇంట్లో సామాన్లు తగలబెట్టి ఎవరితో చెప్పకుండా వచ్చేసింది. ఈమెను జీవీఎంసీ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ మహిళా నిరాశ్రయ వసతి గృహంలో ఉంచి శ్రద్ధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యం చేయించడంతో ఆమె కోలుకుందని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమె ఆరోగ్యం మెరుగు పడటంతో వైజాగ్ నుంచి నేరుగా ఆమె స్వగ్రామం అయిన వాడి తీసుకెళ్లి తండ్రి అహ్మద్ హుస్సేన్‌కి అప్పగించారు. ఆసియా కుటుంబ సభ్యులు ఏయూటీడీ, శ్రద్ధా బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుకతోటలో మహాన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువైన కనకమాంబ అమ్మవారి వార్షిక మహోత్సవంలో భాగంగా ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్వల సురేష్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. 3 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని సంఘ అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు గొలగాని అప్పారావు, బొట్ట సింహాచలం(శివ), ఈగల సత్యం, ఉపాధ్యక్షులు పల్లా అప్పారావు, ప్రసాది అప్పారావు, జాయింట్ సెక్రటరీలు ముమ్వల శ్రీను, ముగడ శేఖర్, కోశాధికారి గొలగాని అప్పలరాజు, సహాయ కోశాధికారి గొలగాని రామచంద్రావు, ఉప్పిలి కృష్ణంనాయుడు, ఈగల గోపి, ఒమ్మి గోపినాథ్, పల్లా శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటో చక్రాలు మాయం



రామకృష్ణాపురంలో వెనుక చక్రాలు చోరీకి గురైన ఆటో

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో రోడ్డుపై శనివారం రాత్రి నిలిపిన ఆటోకు తెల్లవారే సరికి చక్రాలు మాయమయ్యాయి. ఇక్కడ ఆటో యజమాని గ్రామం వైపు ఉన్న బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆటో పార్క్‌చేశాడు. ఆదివారం ఉదయం ఆటో తీయడానికి ఇంటి నుంచి బయటకు వచ్చి చూసే సరికి దాని వెనుక రెండు చక్రాలు కనిపించలేదు. శనివారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో చక్రాలు విప్పేసి పట్టుకుపోయారు. దీంతో యజమాని లబోదిబోమన్నాడు. ఈ ప్రాంతంలో తరచూ ఆటోలో సీట్లు తొలగించి పట్టుకుపోవడం, బైక్‌ల్లో పెట్రోలు తీసేయడం వంటివి జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు రామకృష్ణాపురం వైపు నైట్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

త్వరలో వెలమ గర్జన సభ

ఏయూక్యాంపస్: వెలమ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయంపై గళమెత్తుతూ త్వరలో విశాఖ వేదికగా వెలమ గర్జన సభ నిర్వహిస్తామని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు తెలిపారు. బీచ్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షలకు పైగా ఉన్న వెలమ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయాన్ని సభలో వివరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మలాంటి.. అంగన్‌వాడీ



తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న ఆశ వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త

- చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన
- గర్భిణులు, బాలింతలకు చక్కని సేవలు
- ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం పంపిణీ



చిన్నారులను ఆడిస్తున్న అమ్మవారివీధి అంగన్‌వాడీ కేంద్రం టీచర్

అల్లిపురం: అమ్మ లాలనకు కేరాఫ్ అడ్రస్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు నిలుస్తున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతల కోసం చక్కని సేవలందిస్తున్నాయి. పిల్లలకు విద్యా బుద్ధులు, క్రమశిక్షణ నేర్పిస్తున్నాయి. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య పరిరక్షణ, అవగాహన కార్యక్రమాల వంటి అన్ని అంశాలను శ్రద్ధతో నిర్వహిస్తున్నాయి. టేక్ హోమ్ పద్ధతిలో బాలింతలకు ఇంటికే రేషన్ అందిస్తూ వారు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల లభిస్తున్న సేవలపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల ప్రగతి తెలిపేందుకు పేరెంట్–టీచర్ మీటింగులు..

గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ అవసరమైన పోషకాహారాన్ని



ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

అందజేస్తున్నారు. చిన్నారులు రక్తహీనతతో బాధపడకుండా ఉండేందుకు వీలుగా డ్రై రేషన్ పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను అద్భుతంగా తీర్చిదిద్దడంతో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సేవలందిస్తున్నాయి.

ఇంటికే సరుకులు..

టేక్ హోం రేషన్ పద్ధతిలో గర్భిణులు, బాలింతలకు 15 రోజులకు ఒకసారి 1 నుంచి 5వ తేదీలోపు రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పావు కేజీ బెల్లం, పావు కేజీ బెల్లం చెక్కీలు, పావు కేజీ ఖర్జూరం, 3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర కేజీ ఆయిల్, 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందిస్తున్నారు. రెండో విడతగా నెలలో 16వ తేదీ నుంచి మొదటి విడతలో ఇస్తున్నట్టే పంపిణీ చేస్తున్నారు. పిల్లల తల్లులకు నెలలో రెండు సార్లు కలిపి 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్నారు.

ప్రారంభమైన అడ్మిషన్లు..

అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అంగన్ వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ నూతన సీడీపీవో కె.నీలిమ స్వయంగా పాల్గొని చిన్నారుల చేత శాస్త్రోక్తంగా అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసాలు చేయిస్తున్నారు. అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి ఆటపాటలతో కూడిన విద్యా బోధనను, ప్రభుత్వ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో నీలిమ కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహర్దశ

అంగన్‌వాడీ కేంద్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మోడరన్ ప్రీ స్కూళ్లుగా తీర్చిదిద్దింది. అప్పటి నుంచి పిల్లలకు నూతన రీతిలో విద్యా బుద్ధులు నేర్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను టీచర్, ఆయా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఆటపాటలతో విద్య నేర్పేందుకు రకరకాల ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు.

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు..

జీవీఎంసీ 32,33,34 వార్డుల్లో అమ్మవారి వీధి, కుమ్మర వీధి, బంగారుమెట్ట, మిరపకాయలవీధి, వెంకటేశ్వరమెట్ట, ఎస్సీ కాలనీ, నేరెళ్లకోనేరు, చలువ తోట, ఎన్‌టీఆర్ కాలనీ, కొబ్బరితోట–1,2, జెండా చెట్టు, అచ్చియ్యమ్మపేట, నేతాజీనగర్, మోడల్ స్కూల్‌లో అంగన్ వాడీ కేంద్రాలున్నాయి. ఒక్కో ప్రీ స్కూల్లో 20 మంది చొప్పున చిన్నారులు చదువుకుంటున్నారు. ఈ సెంటర్ల పరిధిలోని లబ్ధిదారులందరికీ ప్రతి నెలా పౌష్టికాహారం అందజేస్తున్నారు.

పౌష్టికాహారం అందిస్తున్నారు..

అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు ప్రతి నెల ఆశ వర్కర్లతో ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు. బరువుతో పాటు సమయానికి తీసుకోవాల్సిన వ్యాక్సిన్లు, మందులు అందజేస్తున్నారు.

– ఎం. గాయత్రి, కుమ్మరవీధి

పిల్లలకు చక్కటి కేరింగ్..

మా పిల్లలను ఉదయం 9 గంటలకు పంపిస్తాం. వారిని అంగన్‌వాడీ ఆయా, టీచర్ ఆటలు ఆడించి, అక్షరాలు నేర్పించటమే కాకుండా సమయానికి పౌష్టికాహారం అందిస్తున్నారు. వారితో ఆటలు ఆడించి, పాటలు పాడించి చక్కటి పద్ధతులు నేర్పిస్తున్నారు.

– ఆర్.సౌజన్య, అమ్మవారివీధి

చేనేతకు ప్రోత్సాహం



చేనేత వస్త్ర ప్రదర్శనను సందర్శించిన మంజులారెడ్డి

మురళీనగర్: మాధవధార వుడా కాలనీ సామాజిక భవనంలో నిర్వహిస్తున్న చేనేత, హస్తకళల ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిల్పారామాల చైర్‌పర్సన్ సీహెచ్ మంజులారెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, హస్త కళాకారులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ఆమె పరిశీలించారు. చేనేత, హస్త కళాకారులను తమ సంస్థ ప్రోత్సహిస్తుందని ఆమె చెప్పారు.

వార్డు అధ్యక్షుడు కనకరెడ్డికి సత్కారం



కనకరెడ్డి దంపతులను సత్కరిస్తున్న వాసుపల్లి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన అలపన కనకరెడ్డిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్, కార్యకర్తలు సత్కరించారు. ఆదివారం వార్డులో పార్టీ నాయకులు సుధ ఆధ్వర్యంలో భారీ సత్కార సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కనకరెడ్డి ఎన్నో సవాళ్లు ఎదుర్కొని నిలబడ్డ నాయకుడన్నారు. అందరినీ కలుపుకుని వార్డులో పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. అందుకే పార్టీ అధినేత మరోసారి వార్డు అధ్యక్ష పదవి ఆయనకే ఇచ్చారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి కనకరెడ్డి దంపతులను భారీ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ సిటీ సెక్రటరి ఎ. ఆదివిష్ణురెడ్డి, సౌత్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, రమణమ్మ, బత్తుల రాము, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మళ్ల బుజ్జి, లండా రమణ, లింగం శ్రీను, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర, రమణమ్మ, బత్తుల రాము, సంతోష్, కర్రి రాజు, శేఖర్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాలు, నిత్యావసర వస్తువుల పంపిణీ



పేదలకు వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న వాసుపల్లి, గురజాపు రవి, చేపల నూకరాజు

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ 38వ వార్డు అధ్యక్షుడిగా నియమితులైన గురజాపు రవి అభినందన సభ ఆదివారం వార్డు పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు నాయకుడు చేపల నూకరాజు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు, నిత్యావసర సరుకులను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ముందుగా వాసుపల్లి వార్డు అధ్యక్షుడు గురజాపు రవిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం త్వరలో సరికొత్తగా అవతరించబోతుందన్నారు. ప్రజల ఆశీస్సులతో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారని వాసుపల్లి వెల్లడించారు. గురజాపు రవిపై ఆదరాభిమానాలు చూపిస్తున్న స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. మంచి సేవా కార్యక్రమం నిర్వహించిన చేపల నూకరాజును వాసుపల్లి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, వార్డు యువజన విభాగం నాయకుడు చేపల నూకరాజు, పార్టీ నాయకులు పాటోజు ప్రసాద్, సారిపల్లి అరుణ, లండా నూకరాజు, అర్జున్ ప్రసాద్, 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, బోడిపల్లి ధనరాజు, సాగర్, ఆకుల శ్యామ్, రామరాజు, అయ్యప్ప, కొసర కిరణ్, సురేష్, అన్మోల్, పట్నాల సతీష్, పాటోజు నాని, చేపల ప్రసాద్, దూడ అప్పలరాజు, జుత్తాడ సురేష్, గొరస నానాజీ తదితరులు పాల్గొన్నారు.

హాస్యంలో జంధ్యాలది ప్రత్యేక ఒరవడి



మాట్లాడుతున్న జంధ్యాల ఆప్తమిత్రుడు, ప్రముఖ నటుడు డాక్టర్ ఎం.సి.దాస్

సీతంపేట: జంధ్యాల సినిమాల్లో హాస్యం లోకవిదితమని, ఆయన హాస్యం గురించి పరిచయం అక్కర్లేదని జంధ్యాల ఆప్తమిత్రుడు, ప్రముఖ నటుడు డాక్టర్ ఎం.సి.దాస్ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన 'హాస్యానికి భాష్యం చెప్పిన జంధ్యాల' అనే అంశంపై ఆయన ప్రధాన వక్తగా ప్రసంగిస్తూ జంధ్యాలతో తనకున్న తీపి జ్ఞాపకాలు, హాస్య సంభాషణలు, సినిమాలోని సంఘటనలు సభకు వివరించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం జంధ్యాల నుంచి ఫోన్ వచ్చేదని, ఒక్కోసారి రాత్రిళ్లు గంటల తరబడి మాట్లాడుకునే వారమని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో జంధ్యాల ఎస్.ఆర్. కళాశాలకు నల్ల అంబాసిడర్‌లో వెళ్లేవారని, జంధ్యాల ఎక్కడ ఉన్నా అక్కడ స్నేహితులు గుంపులుగా ఉండేవారన్నారు, కాలేజీ రోజుల నుంచే నాటకాలు రాసేవారని, ఆయన రాసిన నాటకాలకు తాను దర్శకత్వం వహించేవాడినని తెలిపారు. జంధ్యాల పూర్తి పేరు జంధ్యాల వీర వెంకట శివ శుబ్రహ్మణ్య శాస్త్రి అని, ఏరా శాస్త్రి అని పిలిచేంత చనువు తనకు ఉండటం అదృష్టమన్నారు. నరసాపురంలో 1951లో జన్మించిన జంధ్యాల 1974లో సినీరంగప్రవేశం చేశారన్నారు. స్నేహం అనేది జంధ్యాల సంపదగా భావించేవారని, తన సినిమాల్లో స్నేహితులతో జరిగిన సంభాషణలు వాడేవారని గుర్తు చేశారు. జనవరి 14 జంధ్యాల జయంతి, జూన్ 19 వర్ధంతిని ఆయన వీరాభిమానులు, తెలుగు రాష్ట్రాల ప్రజలు జరుపుతున్నారని తెలిపారు. మండలాధీశుడు చిత్రంతో కోట శ్రీనివాసరావుకు సినిమా ఛాన్సులు తగ్గిపోతే అహనా పెళ్లంట చిత్రంతో మరల పునర్జన్మ ఇచ్చారని గుర్తు చేశారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ జంధ్యాల హాస్యం గురించి మననం చేసుకునే అవకాశం విశాఖ రసజ్ఞ వేదిక కల్పించడం అదృష్టమని తెలిపారు. జంధ్యాల హాస్యం ఎంతో ఆహ్లాదంగా ఉంటుందన్నారు. అనంతరం ప్రధాన వక్త ఎం.సి.దాస్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఆచార్యులు పిళ్లా రమణమూర్తి సన్మానపత్రాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, ఎల్లాప్రగడ శ్రీనివాస కుమార్, పలువురు సాహితీవేత్తలు, జంధ్యాల అభిమానులు పాల్గొన్నారు.

మహిళల చెస్ టైటిల్ హేమిషా కైవసం



హేమిషా, కుమారి మధ్య ఆసక్తికరంగా సాగుతున్న పోరు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా మహిళల చదరంగం చాంపియన్‌షిప్‌ను ఎన్.హేమిషా కైవసం చేసుకుంది. జి.కుమారి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం శ్రీ కశ్యప్ జూనియర్ కళాశాలలో ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొత్తం 63 మంది మహిళా చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు ఫిడే ర్యాంకింగ్ సాధించిన వారు ఉండటం విశేషం. టోర్నీలో రెండో ర్యాంక్‌తో (1656 ఫిడే రేటింగ్) బరిలోకి దిగిన జి.కుమారి, చివరిదైన ఆరో రౌండ్‌లో మూడో ర్యాంక్‌తో ఆడిన ఎన్.హేమిషా (1490 రేటింగ్)తో డ్రాగా ముగించింది. పాయింట్లలో సమానంగా నిలిచినప్పటికీ, టైబ్రేకర్స్‌లో కుమారి వెనుకబడటంతో హేమిషా విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో టి.బంధవిక, డి.దివ్య (1463), హెచ్ఎస్ బుష్రా ఐదు పాయింట్లు సాధించినప్పటికీ, టైబ్రేకర్లలో వెనుకబడి జిల్లా జట్టుకు ఎంపిక కాలేకపోయారు. ఎరీనా కాండిడేట్ మాస్టర్ ఎం.మనస్వి(1489)తో పాటు ప్రవల్లిక, ఆశ్రిత, లలిత్యా నాలుగున్నరేసి పాయింట్లతో టోర్నీని ముగించారు. ఆసక్తికరంగా ఫిడే రేటర్ మనస్వికి జిల్లా జట్టులో స్థానం దక్కలేదు. మరో వైపు ఆరీనా ఫిడే మాస్టర్ ఎస్.గౌర్లి పోటీలకు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న ఏపీ అంతర్ జిల్లాల మహిళల చాంపియన్‌షిప్‌కు అర్హత లభించింది.

కొత్త కార్యవర్గం ఎన్నిక



గణేష్ సాయి షటిల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం: వెంకోజీపాలెంలోని వుడా కల్యాణ మండపం ఎదురుగా ఉన్న పార్కులో గణేష్ సాయి షటిల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. కార్యవర్గ గౌరవ అధ్యక్షుడిగా మద్దాల శివ, అధ్యక్షుడిగా కాళ్ల ఆనంద్, ఉపాధ్యక్షుడిగా వేగి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పీలా కనకరాజు, కార్యదర్శిగా వేగి రమణ, కోశాధికారిగా కాళ్ల నాయుడు, ఆడిటర్‌గా దాడి ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

అలరించిన సంగీత విభావరి



మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన మెగా సినీ సంగీత విభావరి ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. మెగాస్టార్ చిరంజీవితో పాటు పలు సినీ హీరోలకు సంబంధించిన పాటలు పాడి గాయనీ గాయకులు మెప్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కందుల నాగరాజు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కళాకారులకు కొదవ లేదన్నారు. ఎంతో మంది గాయనీ గాయకులు పలు వేదికలపై ప్రతిభా పాటవాలు చాటుతూ మెప్పిస్తున్నారన్నారు. చిరంజీవి కళాపరిషత్ అధ్యక్షుడు గెంబలి జగదీష్ క్రమం తప్పకుండా సంస్థ వార్షికోత్సవంతో పాటు సంగీవ విభావరి నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు గంటి మురళీధర్, చెన్నా తిరుమలరావు, బి.వి.రామ్, రవితేజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు సరుకులు అందిస్తున్న జగదీశ్వరరావు

సీతంపేట: అక్కయ్యపాలెం శబరి కుటీర్ బృందావనంలోని కోన కుంచయ్య చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో మేనేజింగ్ ట్రస్టీ కోన జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తన తల్లి కోన మహాలక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 150 మంది పేదలకు బియ్యం, పప్పు, నూనె వంటి సరుకులు అందించారు. నిరుపేద విద్యార్థులకు విద్యావికాస్ పేరిట స్కూల్ ఫీజులు చెల్లించి, పుస్తకాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అప్పలరాజు, మురళీకృష్ణ, కృష్ణ కల్యాణి, యోజన రాణి, కృష్ణకుమారి, లక్ష్మి సత్యవతి, కుశాల్, కుసుమేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ఊరంతా పండగే

- రాచపోలమాంబ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- రేపటి నుంచి జూలై 24 వరకు వేడుకలు



చెరువు గట్టు వద్ద అమ్మవారి ప్రధాన దేవాలయం



అల్లిపురం ప్రజల ఆరాధ్య దైవం రాచపోలమాంబ అమ్మవారు

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, అల్లిపురంతో పాటు 14 గ్రామాల ఆరాధ్య దైవం రాచపోలమాంబ (గొడుగుల అమ్మవారు) అమ్మవారి మహోత్సవాలు ఈ నెల 24 నుంచి జూలై 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన భూలోకమాత అమ్మవారి ఉత్సవం, జూలై 1వ తేదీన పరదేశమ్మ అమ్మవారి ఉత్సవం, 6వ తేదీన ఉజ్జిడి బండి తిరుగుట, 7వ తేదీన పుట్ట బంగారం తేవడం, 8వ తేదీన దుర్గాలమ్మ అమ్మవారి ఉత్సవం, ఘటాల ఊరేగింపు, 12వ తేదీన సత్తమ్మవారి పండగ, 13వ తేదీన మరిడమ్మ ఉత్సవం, 14వ తేదీన పూలఘటం, అమ్మవారి సతకం పట్టు నుంచి తొలేళ్ల సంబరం, 15వ తేదీన ప్రధాన పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 22వ తేదీన మారువారం, 24వ తేదీన నీలమ్మవారంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ఊరంతా సందడే..

ఈ సందర్భంగా అల్లిపురం మెయిన్‌రోడ్డుతో పాటు మార్కెట్ రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్, గోకుల్ థియేటర్ రోడ్డుతో పాటు మెయిన్‌రోడ్డులో గల అమ్మవారి సతకం పట్టు దేవాలయం రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అమ్మవారి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలను నిరోధిద్దాం



సైక్లోథాన్‌లో పాల్గొన్న సైక్లిస్టులు

మురళీనగర్: మాదక ద్రవ్యాలను నిరోధిద్దాం అంటూ సైక్లిస్టులు పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ పఖ్వాడా జ్ఞాపకార్థ ఎన్‌సీబీ, ఈగిల్ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన విశాఖపట్నం సైక్లోథాన్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మత్తుకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివారం సైక్లోథాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సైక్లోథాన్‌ను పంకజ్ కుమార్ ద్వివేది జెండా ఊపి ప్రారంభించారు. విశాఖపట్నం సూపరింటెండెంట్ రాజన్ కుమార్, ఈగిల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. రమేష్, కళ్యాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. సైక్లింగులో వంద మంది పాల్గొన్నారు.

స్టాపర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కొమ్మాది : కంచరపాలెం అరుంధతినగర్‌కు చెందిన జి.ఈశ్వరరావు (34) ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జి.అనిత నగరంలోని బంగారు నగల విక్రయ దుకాణంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం ఉద్యోగరీత్యా ఈశ్వరరావు భీమిలి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా యోగాంధ్ర కోసం రామానాయుడు స్టూడియో సమీపంలో ఏర్పాటు చేసిన స్టాపర్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై దూరంగా ఎగిరిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.